# నిశ్శబ్దాలంకారం

– శంకరమంచి పార్ధసారధి

**పలకరింపుల్లోనూ, మాట్లాడుకోవటంలోనూ గూడా పద్ధతున్నాయి. కొందరు హలో అనేసి, ఓ చిరునవ్వు విసిరి చక్కాపోతారు. వీళ్ళు ఉత్తమం. వాళ్ళగొడవేదో వాళ్ళు పడతారు. ఇంకోళ్ళ జోలికిరారు. వీళ్ళతో ఎవరికీ పేచీలురా.**

మరికొందరు హల్లో అంటూ పలకరించి, ' పిల్లలు కులాసానా ! ప్రమోషన్ విషయం ఏమైంది ? మీ గులాబీ చెట్టు పూలు పూస్తోందా ? ' లాంటి రెండు మూడు పొడిపొడి ప్రశ్నలడిగి సెలవు పుచ్చుకుంటారు. వీళ్ళకి ముందు చూపే జాస్తి, ఎప్పుడూ ఏరకంగా, ఎవరితో పనిపగడుతుందోనని భయం కొద్దీ ప్రతివాళ్ళతోనూ పరిచయాన్ని పచ్చగా వుంచుకుంటారు. అయినా ఫర్వాలేదనిపిస్తోంది. ఈకరం పలకిరింపులకి స్వార్ధమే కారణమయినా బుర్ర తినేవాళ్ళకన్నా బెటరే కదా అనిపిస్తుంది.

ఇక మూడో మనుషులుంటారు. ఏళ్ళు కదుడేంజరు బ్రాండ్ మనుషులు. వీళ్ళచేతిగ్గానీ చిక్కే మా గంటలు, రోజులు గడిచిపోతున్నా మనల్ని వదిలిపెట్టరు. కుశలంతో కచేరి మొదలయ్యి ఆర్ధికపరిస్ధితుల గురించి టచ్ చేస్తూ రాజకీయాల్లోకెళ్ళి , గోదావరి వరదల గురించి, రాయలసీమ క్షామం గురించీ, ఆపైన లాకప్ చావుల గురించీ , పి.టి ఉష పరిగెత్తే విధానం గురించీ.... ఇలా అనర్గళంగా నట్టువాంగం నడుస్తూనే ఉంటుంది. కచేరి మొదలయిన అయిదు నిముషాలకల్లా మనకర్ధం అయిపోతుంది. దొరక్కూడని వాళ్ళకి దొరికిపోయామని, వాళ్ళు చెప్పేది వింటూనే ఆలోచిస్తుంటాం, ఎలారా బయటపడేది అని. ఇంకో అయిదు నిమిషాలు గడిచాక మనకసలు ఏ ఆలోచనావుండదు. బుర్రంతా ఖాళీ అయినట్లపిస్తుంది. అంటే దానర్ధం మన మెదడ్ని బాదంపప్పు తినేసినట్లు నమిలేసాడన్న మాట. ఇహ మీరు మీరుకారు. కబేళానికొచ్చిన మేకపిల్ల, రేవుకొచ్చిన కొల్లాయి గుడ్డల్లాంటివాళ్ళు. మిమ్మల్ని ఉతికి ఆరేసి, పెట్టెరుద్ది చివరికి ' వెళ్ళి రావోయ్ మళ్ళీ ఎప్పుడైనా కలుద్దాంలే ' అంటూ హెలికాప్టర్లోంచి వదిలేసిని సాంబారుపొట్లంలా టప్పునవదిలేసి మాయమైపోతారు.

అసలు మీరెక్కడున్నారో తెలీటానికి కాస్త టైం పడుతుంది. ఆపైన మీ పేరేమిటో, ఇల్లెక్కడో వగైరా వివరాలు గుర్తుకురావాలంటే ఇంకాస్త టైం పడుతుంది.

అలీ బ్రయిన్ ఈటర్స్ గురించి మా ఫ్రెండొకడు రీసెర్చిచేశాడు, వీళ్ళకి ఇళ్ళల్లో సుఖశాంతులుండవట. అంచేత హమేషా రోడ్లపైన కాలక్షేపం చేస్తుంటారట. ఇదోరకం వ్యాదిట. జపాన్లో ఓ పెద్దమనిషి మందు కనిపెట్టడానికి ప్రయత్నిస్తుండగా ఒక బ్రెయిన్ ఈటర్ ఆయన మెదడు కాస్తా గుటకాయస్వాహా చేసాట్ట. అలా జరక్కుండావుంటే ఈపాటికి మార్కెట్లోకి మందులొచ్చేవిట. ఈబ్రెయిన్ఈటర్స్కి ఏరోజన్నా కనీసం ఒక్క రన్నా దొరక్కపోతే, ఖాళీ ప్రదేశాల కెళ్ళి వాళ్ళకివాళ్ళే గంటలతరబడి మాట్లాడేసుకుని , నవ్వేసుకుని , వెనక్కొస్తారట.

ఇలా మెదడుని మేసే వాళ్ళు పరిచయం లేనివాళ్ళయితే కొంతకాలం కొంతమెరుగు . అదే అప్పిచ్చుకునేవాడో, వైద్యుడో , ఆఫీసరో, హైక్లాసు చుట్టమో అయితే మనల్ని ఆ పెరుమాళ్ళు కాదు గదా వాడి ఫాదదరయినా సరే రక్షించలేరు. మా ఆఫీసులో ఓ ప్రబద్ధుడున్నాడు. నెలాఖారులో అప్పుగొట్టమంటే ఇంటికి రమ్మంటాడు. నడిచిపోదామంటాడు. దానికీ ఒప్పేసుకుంటాం. ఇక మొదలెడతాడు కచేరీ. వాళ్ళ తాతని బ్రిటిష్ పోలీసులు ఏ విధంగా కొట్టింది వర్ణించి అరగంట చెప్తాడు. ఆ గాయాలకి ఏ మందులు వాడిందీ గూడా చెప్తాడు. చెప్తూనే మధ్య మధ్యలో ప్రశ్నలు గూడా వేస్తాడు. సరైన జవాబు రాకపోతే మళ్ళీ మొదలెడతాడు. అప్పటికి మనకి సహనం నశించి అప్పు మటాదేవుడెరుగు తప్పించుకోవటం ఎలాగని మార్గాలకోసం అన్వేషిస్తుండగా అలా వెళ్ళి కూరలు చేద్దాం పదమని మార్కెట్లోకి చెయ్యిపట్టి లాక్కెళతాడు. అక్కడ టాపిక్కు మార్చి తన చిన్నతనంలో వంకాయలు ఎలా వుండేవో, ఇప్పుడెలావుంటున్నాయో , ముందుముందు ఇంకా ఎలా తగులడతాయో చెప్తూనే ఏ కూరలు కొనకుండానే బయటికొస్తాడు. మెదళ్ళు మేసేవాళ్ళకి వేరే కూరలెందుకు ? ఇలాంటి వాళ్ళందర్నీ శత్రు దేశాలకి పంపిస్తే ఎలా ఉంటుంది ? ఎవరన్నా దీనికి నడుంకడితే బావుండు .

------- అయ్యిపోయింది -------